# ఏంటిది?

మా ఈశ్వర మానస్‌కి ఏడాదిన్నర దాటింది. రెండో పుట్టిన రోజు దగ్గరికి వస్తోంది. మాటమాటకీ వో నవ్వు... చూస్తున్న మాకు అదో ప్రత్యేక లోకంలా ఉంది. తెలిసున్న మాటలే. కానీ ఆ చిన్ని నోట ముద్దు ముద్దుగా పలుకుతుంటే, కొత్త భాషలా... నూతన నాదంలా విన్న కొద్దీ వినాలనిపిస్తోంది.

వీడు నా మనవడు. కూతురి కొడుకు. ఇంతకు ముందు నా పిల్లల్ని పెంచాను. వాళ్ల మాటలూ విన్నాను. కానీ అప్పుడేం జరిగిందో చెప్పలేను. కానీ అప్పటి తీపికన్నా, ఈ మధురిమ చాలా ఎక్కువ. బహుశా పరుగులాంటి అప్పటి జీవితంకన్నా, ఇప్పటి తీరుబడి... జీవితాన్ని బతికేలా, జీవించేలా చేస్తోందేమో...

'తాతయ్యా' బదులు 'తాతియ్యి' అంటాడు మానస్. విమానాన్ని... ఎందుకో అనుమానం అంటాడు. ఉచ్చారణ దోషం... పలకటంలో తప్పు ఉంది కానీ గుర్తింపులో పొరపాటు లేదు. ఒక్కసారి చూసి గుర్తుపడితే మరిచిపోడు.

'చిన్నపిల్లలు తిరిగే ఇల్లే ఇల్లు...' అనే వాళ్లు మా పెద్దవాళ్లు.

ఇప్పుడు పెద్ద కుటుంబాలు తక్కువ. భాగ్యనగరంలో ఎనిమిది మంది సభ్యులున్న మా ఉమ్మడి కుటుంబం చాలామంది దృష్టిలో విశేషమే. అందరం కలిసి ఒకచోట ఉండడం ఒకటే కాదు, పెద్దాచిన్నా గౌరవం, భక్తీ మా ఇంట్లో మాతోటే ఉంటున్నందుకు తృప్తి.

మా మానస్ చురుకైన వాడని, నడకా, మాట, అన్నింటిలో చురుకేనని చాలామంది అంటున్నారు. వాడి అల్లరి కూడా, అందంగా ముద్దుగానే ఉంటోంది మాకు.

మా కుటుంబ సభ్యులందరూ తెలుగులోనే మాట్లాడుకోటం వల్లేమో... మా మానస్‌కి తెలుగు పదాలు గబగబా రావటమే కాదు, రానురాను స్పష్టంగా పలకటం వస్తోంది. పెద్దపెద్ద మాటలైతే వాడే విడదీసి పలుకుతున్నాడు. హనుమాన్ అనాల్సి వస్తే... హను...మాన్ అని నెమ్మదిగా విడిగా అంటాడు.

అన్ని మాటల్లాగే వాడకి ఆ మాటా వచ్చిందనుకున్నాను నేను. కానీ రెండు రోజులు గడిచేటప్పటికి తరచుగా అదే మాట... ఏ రోజు మొదలెట్టాడో సరిగ్గా గుర్తులేదు కానీ... ఆ మాట నా పాలిట బరువైపోయింది. ఎక్కువ సమయం నా దగ్గరే గడిపే మానస్... అనే ఆ మాట...'ఏంటిది?' నిజానికి అది మాట కాదు... ప్రశ్న. పిచికల్ని, చిలకని, పిల్లిబొమ్మని ... అలాగే రకరకాల వస్తువుల్ని చూపించి వాడు అదే ప్రశ్న...'ఏంటిది?'

వాడి ఆ ముద్దు ముద్దు ప్రశ్న ముందు ఎంత మురిపెంగా ఉందో... వాడు అడగటం... నేను చెబుతూ ఉండటం... అడిగిందే అడుగుతాడు. నేను చెప్పగానే తనూ పలకటానికి ప్రయత్నిస్తాడు. ఒకటి రెండుసార్లు విన్నాక పలుకుతున్నాడు కూడా. వాడి ఈ ముచ్చటనీ, సరదానీ ఇంటిల్లిపాదీ ఎన్నిసార్లు చెప్పుకున్నామో?

కానీ నాలుగు రోజులు గడిచాయో లేదో, మా మానస్ 'ఏంటది'? ప్రశ్నకి నేను నిలవలేకపోయాను. అంతచిన్న వయసులో వాడికి అలసట ఎందుకు లేదో... కళ్లముందు కనపడే ప్రతీదీ వాడికి ఆరా ఎందుకో? నాకు అర్థం కావటంలేదు.

నేను వెంటనే సమాధానం చెప్పలేనివి, నిజానికి కొన్ని నాకు తెలియనివి... వాడు అడుగుతున్నట్టుగా ఉంది.

మాది పాతికేళ్ల క్రితం నేను కట్టిన ఇల్లు. ఓ వంద గజాల పెరడుంది. పెరట్లో పూల, పళ్ల మొక్కలూ ఉన్నాయి. వాటివల్లో, నగరపు గొడవకి కొంచెం దూరంగా వుండటం వల్లో రకరకాల పక్షులు ఇప్పటికీ రోజూ వస్తూంటాయి. వాటిని చూసి చూడగానే మా వాడు రెడీ 'ఏంటిది'? అని.

పిచుకలు, పావురాళ్లు, చిలకలు, కాకులు అయితే చెప్పగలను. కానీ నాకే తెలియని చాలా పిట్టల గురించి ఏం చెప్పను. సీతాకోక చిలుకలు, ఈగలు, దోమలు చెప్పగలను... కానీ పేర్లే తెలియని పురుగుల గురించి ఏం చెప్పను?

నా ఈ చేతకానితనం... ఎప్పుడు విసుగ్గా పరివర్తన చెందిందో చెప్పలేను కానీ... మా మానస్ 'ఏంటిది'? అన్న చాలాసార్లు విసుక్కోవటం నాకే తెలుస్తోంది.

నేను బదులు చెప్పక, విసుక్కుంటే వాడు పేచీ పెట్టడం మొదలెట్టాడు. వాడు ముఖం చిన్నబుచ్చుకున్నా... ఏడ్చినా చూడలేను. రానురాను నాకిది పెద్ద సమస్యగా మారింది.

ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే, వాడికి ఏ మూడో ఏడో దాటి అన్నీ తెలిసి మరింత గట్టి విషయాలు అడిగితే ఎలా?

నా ఆలోచన ఓ వారం రోజుల్లో పరిపరి విధాల సాగింది. దేనిమీదో, సమస్య ఏమిటో, అర్థం కాకుండానే అసహనం, చిరాకు... నిజం చెప్పాలంటే మా మానస్‌ని కొంతవరకు తప్పించుకు తిరుగుతున్నాను కూడా.

అయినా వాడు వదలాలిగా... వదల్లేదు. వాడికీ డొంక తిరుగుళ్లు తెలియవు ఇదివరకటి కంటే అమాయకంగా, నేనెక్కడున్నానో వెతికి మరీ దగ్గరగా వచ్చి 'తాతియ్యా... ఏంటిది'? అంటున్నాడు.

వాడి పసితనానికి కరిగిపోతున్నాను. ఓపిక తెచ్చుకుని మరీ సమాధానాలు చెబుతున్నాను. కానీ అంతర్‌ప్రవాహంలా నాలో విసుగు, వత్తిడిని పెంచుతూనే ఉంది.

ఒకసారి అలాంటి సమయంలోనే తట్టుకోలేక ఆ పసివాణ్ణి గట్టిగా అరిచాను. 'చంపుతున్నావు వెధవా... అస్తమానం వెధవ ప్రశ్నలూ నువ్వూ' అంటూ నేను గట్టిగా అనగానే, నా ఈ రూపం అలవాటు లేని వాడు ఒక్కసారిగా బిక్కముఖం వేసి బేర్‌మన్నాడు.

ఎందుకొచ్చిందో అటువేపుగా వచ్చిన మా అక్కయ్య, వాడి బామ్మ అమాంతం వాణ్ణి దగ్గర చేసుకుని అక్కడ్నుంచి తీసుకుపోయింది.

నా అరుపు నాకే అసహ్యంగా ఉంది. ఎంత ప్రేమగా ఉన్నా, ఎంత కంటికి రెప్పలా కాచినా, పసిపిల్లల మీద తల్లికి కూడా ఎప్పుడో ఒకప్పుడు విసుగు రాకపోదు.అది సహజం. ఆ విషయం తెలుసు. అయినా నా వరకూ నాకే సిగ్గుగా వుంది. తప్పు కాకపోయినా, తప్పు చేసినట్టే ఉంది.

అలా కూచోలేను. లేచి మానస్ దగ్గరికి వెళ్ళలేను. మళ్ళీ వాడే వస్తే... వస్తే బావుణ్ణు... ఎన్ని ప్రశ్నలేనా వెయ్యనీ? వాడు వస్తే బావుణ్ణు... అరగంట గడిచింది. చడీ చప్పుడు లేదు. వాడు కదులుతున్న సందడే లేదు.

ఇంక తట్టుకోలేక మా అక్కయ్యని నేనే పిలిచాను.

పిలిచి "ఏదే వాడు" అనడిగాను నెమ్మదిగా.

"ఏడ్చి ఏడ్చి నిద్రపోయాడు" అంది.

నా తల మరింత దిగిపోయింది. నా మనసు గ్రహించిందో ఏమో... మా అక్కయ్యే...

"నిద్రలేవగానే వాడే వస్తాడురా... పసివాడు వాడికేం గుర్తుండదులే" అంది.

అక్కయ్య నాకన్నా పదేళ్లు పెద్దది. నా చిన్నతనం ఎరిగున్నది. అంతేకాదు. తల్లి తర్వాత తల్లి. నా తత్వం, నా మనసు దానికి తెలుసు. ఆవిడ అలా చెప్పినా, అన్నీ తెలిసినా దిగులుగానే ఉంది. ఏం జరగలేదు... పెద్ద సమస్యా కాదు.

ఆ పసివాడికి గుర్తూ ఉండదు... కానీ... హాయిగా లేదు. సవ్యంగా ఏదీ జరగలేదు. అంతవరకే తెలుస్తోంది.

"పసివాడు దడుసుకునేలా అరిచి... నువ్వు ఏడుపు ముఖం పెడతావేంరా?" అనడిగింది అక్కయ్య. నాకన్నా ముప్ఫై ఏళ్ళు చిన్నవాడైన నా కొడుకుతో నేను మాట్లాడినట్టు, అరవై ఏళ్ల నాతో డెబ్భై ఏళ్ళ మా అక్కయ్య మాట్లాడుతోంది.

"అది కాదే..." అంటూ నేనేదో చెప్పబోతూంటే వారించింది.

"జీవితమంతా పిల్లాజెల్లాల్ని పెంచిన మాకే ఒక్కోసారి విసుగ్గా ఉంటుంది. పిల్లల్తో తట్టుకోలేక పోతాం. విసుక్కోవడం తప్పుకాదు... కానీ" అంటూ ఆగింది అక్కయ్య.

ఏమిటన్నట్టు తలెత్తి చూశాను.

"మానస్‌ది మన అమ్మ పోలికరా... అమ్మమ్మ చెపుతూ ఉండేది. మన అమ్మకూడా చిన్న తనంలో ఇలాగే ఎంతో చురుగ్గా ఉండేదట. ఎక్కడే నా మంచి పాట వినపడితే, తిరిగి ఆ పాట తను పాడేవరకూ వూరుకునేది కాదుట... అందుకే అంతటి విద్వాంసురాలైంది.

'ఏంటది?' అని వాడు అడిగే మాటని మూడు అక్షరాల పదంలాగే చూడకు... ఆ చిన్ని మాట వెనక, ఆ పసివాడి అంతులేని కుతూహలం ఉంది. తన చుట్టూ వున్న జీవితాన్ని అర్థం చేసుకుని, తనదిగా చేసుకోవాలన్న తపన ఉంది. నాకైతే మన అమ్మే మళ్ళీ... మనల్ని వదల్లేక తిరిగి ఇలా పుట్టిందనిపిస్తోంది... అప్పుడు అన్నీ మనకి చెప్పిన అమ్మ ... ఇప్పుడు మనల్ని తనకి చెప్పమంటోంది.

మన చిన్నతనంలో నీకు గుర్తుండే ఉంటుంది. గోరుముద్దలతో, చందమామ పాటలతో, చిన్నచిన్న కథల్తో పిల్లల ఆలోచనకి, పెద్దవాళ్లు ముందుగానే ఆహారం పెట్టేవాళ్లు. ఇప్పుడా బతుకు ఎలాగూ లేదు. కొత్తరకం ఉద్యోగాలు... ఒకటే పరుగులు. పసిపిల్లల వేపు కన్నారా చూసే ఓపిక, ఖాళీలేని తాపత్రయాలు...అవకాశం లేని వాళ్లకి ఎలాగూ లేదు. మానస్ చుట్టూ మనం ఉన్నాం... ముసలివాళ్లం మనం కూడా విసుగులో పడితే ఎలాగరా? వాడికి మనంత మనమే చాలా చాలా నేర్పాలి. అలాంటిది ఇష్టంగా, ఆసక్తిగా

మానస్ అడిగినప్పుడేనా చెప్పకపోతే ఎలా?" అంది.

అక్కయ్య చెప్పింది కొంచెం... కానీ... అందులోని సూక్ష్మం... అంతరార్థం ఎంతో వుంది. నాకు దిగులు తగ్గటమే కాదు... కొత్త ఉత్సాహం వచ్చింది.

మామూలుగా నిద్రలేవగానే మానస్ 'తాతియ్యా' అంటూ నా దగ్గరికి పరిగెత్తుకు వచ్చాడు. వచ్చి గోడమీది బల్లిని చూపించి, ఆ పక్కనే వున్న మా అమ్మ ఫొటో చూపించి 'ఏంటిది?' అన్నాడు.

నాకు నవ్వొచ్చింది. నా నవ్వులోంచి... రెండేళ్ళ క్రితం గతించిన మా అమ్మ నవ్వినట్లైంది. అలా నవ్వుతూనే వాడికి సమాధానం చెప్పాను. గోడమీద ఉన్న దాన్ని బల్లి అని వివరించి... ఈ లోకంలో లేని అమ్మని 'తాతమ్మ' అని చెప్పాను.

మానస్ ప్రతిరోజూ 'ఏంటది' అంటూనే ఉన్నాడు. నేను చెపుతూనే ఉన్నాను. ఈ ప్రక్రియలో ఆరు నెలలు గడిచాయి. వాడికోసం కొంత భాషని నేను పునశ్చరణ చేసుకున్నాను. కొన్ని మళ్ళీ నేర్చుకున్నాను.

ఇప్పుడు మానస్ మరింత స్పష్టంగా తెలుగు పలుకుతున్నాడు. సుమతీ, వేమన, దాశరథీ శతకాల పద్య పాదాలు శ్రద్ధగా వింటున్నాడు. సిడిల ద్వారా, మా మాటల ద్వారా, వాడికి చక్కటి పునాది ఏర్పడిందని నేను అనుకుంటున్నాను. వాళ్ల అమ్మమ్మ దైవ స్తోత్రాలు చెబుతోంది. వాటిల్లోని భక్తి, భావం వాడికి అర్థం అయినా కాకపోయినా మంచి మాటలతో పరిచయం అవుతోంది. పద్యాలు, స్తోత్రాలు తిరిగి చెపుతున్నాడు.

సుస్వరం వినపడితే శ్రద్ధగా వింటాడు. మంచి దృశ్యం కనిపిస్తే ఆకళింపు కోసం అన్నట్టు వాడికళ్లు వెతుకుతున్నాయి. పక్షులన్నా, పురుగులన్నా... జంతువులన్నా వాడు ప్రాణం పెట్టి చూస్తాడు. పచ్చదనాన్ని, కొత్తగా పూచిన పువ్వుల్నీ చూసి ముసిముసి నవ్వుల్తో మురిసిపోతాడు. మూడేళ్ళ పసివాడు... ఎంతచిత్రం అనుకుంటే... మా ఇంటికి వచ్చి మీరూ చూడొచ్చు.

నా ఇంట... నా పిల్లాడికి నా భాష వస్తోంది. మా అమ్మలాగే... ఆవిడ పలికినట్టే మాటల్ని పలుకుతున్నాడని... అచ్చు ఆవిడలానే నడుస్తున్నాడని మాకు చిత్రమైన మురిపెం... మా చిన్నారి మానస్ రూపంలో మా అమ్మనాటి చక్కటి జీవితం తిరిగి మా ముందు తిరుగుతోందన్న తృప్తి....ఓరకమైన అమృతానుభవం....

– ఆంధ్రభూమి దినపత్రిక..24-05-2008.